
సాక్షి ఒడిశా

శనివారం ı 25 ı జనవరి ı 2025

I



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు
నగదు : రూ. 6,37,350
- భువనేశ్వర్/పూరీ



రోడ్డెక్కిన అన్నదాత

పర్లాకిమిడిలో అన్నదాతలు రోడ్డెక్కారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. - IIలో▸



మృతదేహాల గుర్తింపు

ఎదురు కాల్పుల్లో చనిపోయిన మావోయిస్టుల మృతదేహాలను గుర్తిస్తున్నారు. అగ్ర నాయకులు కూడా ఉన్నారు. - IIలో▸

న్యూస్‌రీల్

పీఎంఏవై ప్రచార రథం ప్రారంభం



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న ఖెముండో

రాయగడ: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ప్రచార రథం ప్రారంభమైంది. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ్ కుమార్ ఖెముండో శుక్రవారం సదరు సమితి కార్యాలయంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని రథాన్ని ప్రారంభించారు. అందరికీ పక్కా ఇళ్ల కేటాయింపు గురించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న సర్వేకు సంబంధించి ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ఈ రథం తోడ్పడుతుందన్నారు. అర్హులైన వారి పేర్లను నమోదు చేసే ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సమితి చైర్మన్ టున్ని హుయిక, ఏబీడీవో కాలూచరణ్ నాయక్, నీలమణి పండ తదితరులు పాల్గొన్నారు.

28న బీజేడీ పార్లమెంటరీ సభ్య సమావేశం

భువనేశ్వర్: పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు పురస్కరించుకుని బిజూ జనతా దళ్ పార్లమెంటరీ సభ్య సమావేశం జరగనుంది. పార్టీ అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ అధ్యక్షతన ఈ నెల 28న ఈ సమావేశం జరగనుందని బీజేడీ పార్లమెంటు సభ్యుడు మానస్ మంగరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా పార్లమెంటు బడ్జెట్ సమావేశాల్లో బీజేడీ వైఖరిపై చర్చిస్తారు. ఈ నేపథ్యంలో 7 మంది రాజ్యసభ సభ్యుల్ని ఉద్దేశించి నవీన్ పట్నాయక్ ప్రసంగిస్తారు.

218 కిలోల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు
- వ్యాన్ సీజ్



పోలీసులకు పట్టుబడిన గంజాయి నిందితుడు, సీజ్ చేసిన వ్యాన్

పర్లాకిమిడి: గజపతి జిల్లా మోహానా నియోజికవర్గం అడవ పీఎస్ పరిధిలో అంతరాబ వద్ద పోలీసులకు అందిన పక్కా సమాచారం మేరకు అటుగా వెళుతున్న మ్యాక్స్ పికప్ వ్యానును తనిఖీ చేశారు. వ్యాన్‌లో తొమ్మిది బ్యాగుల్లో గంజాయిని పోలీసులు సీజ్ చేశారు. అందులో ఉన్న గంజాయి మాఫియా అభయ కోరాడాను అదుపులోకి తీసుకున్నారు. మోహానా తహసీల్దార్ సమక్షంలో గంజాయి బస్తాలను తూకం వేయగా సుమారు 218 కిలోలు ఉన్నట్టు నిర్ధారించారు. గంజాయి బస్తాలు ఆర్.ఉదయగిరి బ్లాక్ అంతరాబ నుంచి బరంపురం తరలిస్తుండగా పోలీసులు కాపు కాసి పట్టుకున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టం కింద అడవ పోలీసుస్టేషన్‌లో నమోదు చేసి కోర్టుకు తరలించినట్టు అడవ ఐఐసీ శుభ్రాంత్‌కుమార్ పండా తెలియజేశారు. దాడిలో ఎస్సై ప్రశాంత్ పలక, అడవ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుగుబంటి దాడిలో వ్యక్తికి తీవ్ర గాయాలు



ఎలుగుబంటి దాడిలో గాయపడిన కమలలోచన

జయపురం: ఎలుగుబంటి దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తి డొమునాయికగుడ గ్రామానికి చెందిన కమళ లోచన చంద్రపాడియ(55)గా తెలిసింది. బొయిపరిగుడ సమితి కెందుగుడ గ్రామ పంచాయతీ డొంబునాయికగుడ గ్రామానికి చెందిన కమళ లోచన చంద్ర పాడియకు భార్య వంట చేసేందుకు కట్టెలు తేవాలని కోరింది. దీంతో ఉదయం తొమ్మిది గంటల సమయంలో గ్రామ సమీపంలోని బాతడొంగర పర్వతంపైకి కట్టెలు సేకరించేందుకు కమళ లోచన చంద్ర పాడియ వెళ్లాడు. ఎండు కర్రలు సేకరిస్తున్న సమయంలో హఠాత్తుగా తుప్పల్లో నుంచి ఎలుగుబంటి వచ్చి అతనిపై దాడి జేసింది. దీంతో భయంతో అతను రక్షించాలని కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వారు విని అక్కడకు చేరుకొని గట్టిగా కేకలు వేయడంతో ఎలుగుబంటి సమీపంలో ని అటవీ ప్రాంతంలోకి పారిపోయింది. ఎలుగు దాడిలో గాయపడిన కమళలోచనను ద్విచక్ర వాహనంపై బొయిపరిగుడ కమ్యూనిటీ ఆస్పత్రిలో చేర్పించారు. కమళలోచనకు కాలు, చేతులు, గుండెపై బలమైన గాయాలు అయినట్లు సమాచారం. ప్రాథమిక చికిత్స చేసిన డాక్టర్లు పరిస్థితి విషమంగా ఉండటంతో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రికి రిఫర్ చేశారు.

పూరీ జగన్నాథ ఆలయంలో..

వేసవికి ప్రత్యేక ఏర్పాట్లు

భువనేశ్వర్: నిత్యం యాత్రికుల తాకిడితో కిటకిటలాడే పూరీ శ్రీ జగన్నాథ ఆలయ ప్రాంగణంలో భక్తులు, యాత్రికుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ ఏడాది వేసవి కాలం తీవ్రత దృష్ట్యా ప్రత్యేక సౌకర్యాల కోసం సన్నాహాలు చేస్తున్నారు. వేసవి తాపంతో వడదెబ్బ సంబంధిత విపత్తు తలెత్తకుండా ముందస్తుగా జాగ్రత్త వహిస్తున్నారు.

ఆలయ సముదాయంలో సురక్షిత తాగునీరు

శ్రీ మందిరం సముదాయంలో దర్శనం కోసం విచ్చేసే యాత్రికుల కోసం సురక్షిత (ఆర్‌ఓ) తాగునీరు సౌకర్యం కల్పిస్తున్నారు. భక్తుల సౌలభ్యం కోసం శ్రీ మందిరం ప్రాంగణంలో 50 తాగునీటి స్టాండ్ పోస్టులను ఏర్పాటు చేయాలని శ్రీ జగన్నాథ ఆలయ పరిపాలన (ఎస్‌జేటీఏ) యోచిస్తోంది.

వేడిమి నివారణ సన్నాహాలు

మండుటెండ సమయంలో శ్రీ మందిరం ప్రాంగణంలో తిరుగాడే వారి పాదాలు ఎండ వేడిమికి గురి కాకుండా చేసేందుకు నడిచే మార్గంలో తివాచీలు, దారి పొడవునా ఎండ నుంచి ఛాయ కల్పించేందుకు ఛాయా పందిళ్లు, చన్నీటి సించనం వంటి శీతల సదుపాయాలతో ఆపత్కర అనారోగ్య పరిస్థితుల నిర్వహణ కోసం ప్రథమ చికిత్స కేంద్రాలు, పలు ప్రాంతాల నుంచి విచ్చేసే యాత్రికుల కోసం సమాచార కేంద్రాలు, హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తున్నారు. పూరీ కలెక్టరు అధ్యక్షతన జరిగిన శ్రీ జగన్నాథ ఆలయ పాలక వర్గం (ఎస్జేటీఏ) వేసవి సన్నాహక సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు.



శ్రీ మందిరం

ఈ సమావేశంలో తాగునీటి పోస్టుల ఏర్పాటుకు సంబంధించిన వివరణాత్మక బ్లూప్రింట్, ప్రణాళికాబద్ధమైన లేఅవుట్‌ను ఖరారు చేశారు. భక్తులు హాయిగా నడిచేందుకు కార్పెట్‌లు ఏర్పాటు చేయడం, వేడి నుంచి రక్షించేందుకు ఫ్యాన్‌లతో కూడిన ఛాయా పందిళ్ల నిర్మాణాలు, చన్నీటి సించన వ్యవస్థ, ప్రథమ చికిత్స కేంద్రాలు వంటి మరిన్ని సౌకర్యాల కల్పనపై చర్చించారు.

సింహ ద్వారం ఆవరణలో సమాచారం

శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణలో భక్తులు, యాత్రికులకు ఆలయ సంబంధిత సమాచారం అందజేసేందుకు సమాచార కేంద్రాలు, సహాయ డెస్కల ఏర్పాటు ప్రతిపాదన ఆమోదించారు.

వేసవి తాపం ఉపశమనం

చలి క్రమంగా తగ్గుముఖం పడుతున్న తరుణంలో వేసవి కాలం దృష్ట్యా తీవ్రమైన వేడిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు తగినంత తాగునీరు, శీతలీకరణ సౌకర్యాలు ఉండేలా చూడాలని ఈ సమావేశంలో నిర్ణయించినట్లు పూరీ కలెక్టర్ సిద్ధార్థ్ శంకర్ స్వంయి తెలిపారు. ఆయన అధ్యక్షతన జరిగిన వేసవి సన్నాహక సమావేశంలో ఆలయ అభివృద్ధి కార్యనిర్వహణాధికారి, జిల్లా పోలీసు సూపరింటెండెంట్, అగ్నిమాపక సేవల శాఖ అధికారులు, ప్రభుత్వ నిర్మాణం, విద్యుత్, రవాణా శాఖల ప్రతినిధులు వంటి కీలక అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్నాథ ఆలయ రత్న భాండాగారం మరమ్మతు పనులకు సంబంధించిన అంశాలపై కూడా సమావేశంలో చర్చించారు. భారత పురావస్తు శాఖ ఏఎస్‌ఐ ముందస్తు ప్రతిపాదన ప్రకారం భాండాగారం నిర్వహణ, మర్మతు పనులకు నిర్ధారిత వెసులుబాటు కల్పించక పోవడంతో ఈ పనుల్లో కొంత మేరకు జాప్యం చోటు చేసుకుంది. ఈ మేరకు తగిన చర్యలు చేపట్టి పనులు వేగిరపరచనున్నట్లు కలెక్టరు తెలిపారు.

డెంగీ, మలేరియాపై

అప్రమత్తంగా ఉండాలి



దోమతెరలు పంపిణీ చేస్తున్న తారాప్రసాద్ బాహిణీపతి

- జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి



ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహిణీపతికి స్వాగతం పలుకుతున్న ఆస్పత్రి సిబ్బంది



దోమతెరల వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

జయపురం: కొరాపుట్ గ్రామీణ ప్రాంతాల్లో దోమల వలన సంక్రమించే మలేరియా, డెంగీ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జయపురం ఎమ్మెల్యే తారాప్రసాద్ బాహిణీపతి అన్నారు. జయపురం సబ్‌డివిజన్ బొరిగుమ్మలోని కమ్యూనిటీ ఆస్పత్రిలో మందులతో కూడిన దోమతెరలు ప్రజలకు శుక్రవారం వితరణ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జిల్లాలో మలేరియా జ్వరాల కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రత్తంగా ఉండాలన్నారు. దోమల బారి నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో ఔషధంతో కూడిన దోమతెరలను ప్రజలకు సరఫరా చేస్తున్నట్టు వెల్లడించారు. వీటిటి కచ్చితంగా వినియోగించుకోవాలని సూచించారు. అవగాహన లేమి కారణంగా చాలామంది దోమతెరలను వినియోగించకుండా మూల పడేస్తున్నారన్నారు. అలాంటి వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఔషధ దోమ తెరలు అందజేశామని మలేరియా బాధితులను వైద్యులు విస్మరించరాదని హితవు పలికారు. బొరిగుమ్మ కమ్యూనిటీ ఆస్పత్రి అధికారి డాక్టర్ శ్రీకాంత కుమార్ శతపతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కొరాపుట్ ఎంపీ ప్రతినిధి రామ చంద్ర పాడీ, జయపురం ఎమ్మెల్యే ప్రతినిధి అశోక్ గంతాయిత్‌బొరిగుమ్మ, వ్యాపారుల సంఘ అధ్యక్షులు సూర్య ఆచారి, రోగీ కళ్యాణ సమితి సభ్యులు కైలాశ రథ్, మహిళా ప్రసూతి విభాగ అధికారి డాక్టర్ ప్రదీప్ కుమార్ దాస్, బీపీఎం సరోజ్ కుమార్ మహాపాత్రోతో పాటు దమయంతి ముదులి, శ్రీనివాస రావు, సబిత సాహు, గొలక్ బీహారి చౌధురి, ఉర్మిళ మఝి పాల్గొన్నారు. దోమతెలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎం.ఎల్.ఎ కు హాస్పిటల్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



వేదికపై ఎంపీ బోలభద్ర మాఝి, కలెక్టర్ తదితరులు

మల్కన్‌గిరి: జిల్లాలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని నవరంగ్‌పూర్ ఎంపీ బోలభద్ర మాఝి శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అభివృద్ధి సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించి తెలిపారు. రైల్వే ప్రాజెక్టు పనులు వేగవంతం చేయడంపై అధిక ప్రాధాన్యమిచ్చారు. మల్కన్‌గిరి వంటి గిరిజన జిల్లాలో విద్య, ఆరోగ్య రంగాల్లో ఆత్మనిర్భర్ భారత్ పనులు కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఇంటికి సాగునీరు, తాగునీరు, విద్యుత్, పశువుల పెంపకం, పాల ఉత్పత్తి, చేపల పెంపకం వంటి రంగాల్లో స్వావలంబనం సాధించడంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్యం, విద్యలో నాణ్యత పెంపు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను పలు మార్గాల ద్వారా ప్రజలకు అందించడంపై చర్చించారు. ప్రధానమంత్రి జన కల్యాణ యోజన, ముద్రాయోజన, సుకన్య సమృద్ధి యోజన వంటి పథకాల ప్రయోజనాలు చేపట్టాలని సూచించారు. సమావేశంలో మల్కన్‌గిరి ఎమ్మెల్యే నర్సింగ్ మడ్కమి, జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సమారి టంగులు, చిత్రకొండ ఎమ్మెల్యే మాంగు ఖీలో, గోవింద పాత్రో, మల్కన్‌గిరి కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్, అటవీ శాఖ అధికారి ప్రతాప్ కొత్తపల్లి, జిల్లా అదనపు కలెక్టర్ వేద్‌బర్ ప్రధాన్, జిల్లా అబివృద్ధి అధికారి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గోదాంలో అగ్ని ప్రమాదం



మంటల్లో కాలుతున్న గోదాం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా చిత్రకొండ సమితి కేంద్రంలోని ముఖ్య రహదారిలో ఉన్న ఇనుము, అట్టలు, బాటిల్స్ ఉంచే గోదాంలో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. అందరూ ఇళ్లకు వెళ్లాక ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు యజమాని సాహు తెలిపారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ఐఐసి ముకుందో మేల్కా దర్యాప్తు చేస్తున్నారు.

• అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థినులు

రాయగడ: బేటీ పడావో, బేటీ బచావో కార్యక్రమానికి పదేళ్లు పూర్తి కావడంతో జిల్లా యంత్రాంగం శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించింది. జిల్లా అదనపు మేజిస్ట్రేట్ నిహారి రంజన్ కుహరో ముఖ్య అతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థినులు ఈ ర్యాలీలో ప్లకార్డులు పట్టుకుని ర్యాలీలో పాల్గొన్నారు. లింగ వివక్షత లేకుండా అందరూ చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. స్థానిక మహిళా కళాశాల నుంచి ప్రారంభమైన ర్యాలీ పురవీధుల గుండా జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగింది.

5వ ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో

మెరిసిన కిశోర్ చంద్ర రథ్



బ్యాంకాక్‌లో జరిగుతున్న ఐదో ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో బంగారు పతకం అందుకుంటున్న కిశోర్ రథ్



బ్యాంకాక్‌లో జరిగుతున్న అంతర్జాతీయ ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించిన కిశోర్ రథ్

పర్లాకిమిడి: బ్యాంకాక్‌లో జనవరి 18 నుంచి జరుగుతున్న ఐదో ఓపెన్ మాస్టర్ గేమ్స్‌లో పర్లాకిమిడికి చెందిన క్రీడాకారుడు, విశ్రాంత ఎక్సైజ్ ఎస్ఐ కిశోర్ చంద్ర రథ్ ఒక బంగారు పతకం, బ్రాంజి మెడల్‌ను కైవసం చేసుకున్నారు. థాయిలాండ్ రాజధాని బ్యాంకాక్‌లో ఆర్.బి.యస్.సీ. పోలోబ్యాంకు గ్రౌండ్స్‌లో జరగుతున్న 5వ ఓపెన్ మాస్టర్స్ గేమ్స్‌లో 37 దేశాల క్రీడాకారులు పాల్గొనగా, భారత్ నుంచి 42 మంది క్రీడాకారులు ఉన్నారు. కిశోర్ చంద్ర రథ్ 100•4 మీటర్ల రిలే రేస్‌లో గోల్డు మెడల్, ట్రిపుల్ జంప్‌లో కాంస్య పతకం గెలుచుకున్నారు. కిశోర్ రథ్ విజయంపై జిల్లా క్రీడాశాఖ అధికారి ప్రాణకృష్ణ పాణిగ్రాహి, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గతంలోనూ పలు అంతర్జాతీయ క్రీడా వేదికలలో కిశోర్ చంద్ర రథ్ బంగారు, కాంస్య పతాకాలు అందుకున్నారు.

గెలుపు, ఓటములు సహజమే

- పార్టీ పటిష్టతకు కృషి చేయాలి
- నెక్కంటి భాస్కరరావు



అరుణ్ సాహుకు స్వాగతం పలుకుతున్న కార్యకర్తలు



సమావేశంలో ప్రసంగిస్తున్న నెక్కంటి



సమావేశంలో పాల్గొన్న కార్యకర్తలు

రాయగడ: రాజకీయాల్లో గెలుపు, ఓటములు సహజమని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీజేడీ జిల్లా అధ్యక్షుడు నెక్కంటి భాస్కరరావు అన్నారు. స్థానిక తేజస్వీ హోటల్ సమీపంలోని ఆ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రజలంతా బీజేడీతోనే ఉన్నారని, భవిష్యత్‌లో పార్టీ మరింత బలంగా ముందుకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలోని బీజేపీ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ ఎక్కడకు వెళ్లినా ఆయనకు ప్రజలు నీరాజనాలు పలుకుతుండడమే దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. ఏదిఏమైనప్పటికీ కార్యకర్తలు ఓటమి షాక్ నుంచి తేరుకొని భవిష్యత్‌లో పార్టీ విజయానికి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు.

☛ బీజేడీ హయాంలో అభివృద్ధి

కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న నయాగడ్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ అరుణ్ కుమార్ సాహు మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేడీ హయాంలో ప్రజలు ఎటువంటి సౌకర్యాలు పొందారో అందరికీ తెలిసిందేనన్నారు. ఆరు నెలల బీజేపీ పాలనలో ప్రజలు అగచాట్లు పడుతున్నారని ఎద్దేవా చేశారు. పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలతో పాటు ఎటుచూసినా రైతుల ఆర్తనాదాలే వినిపిస్తున్నాయన్నారు. బీజేడీ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రతీ జిల్లాలో కార్యకర్తల సమావేశాన్ని అధిష్టానం నిర్వహిస్తుందని తెలిపారు. కార్యకర్తలు సమైఖ్యతా భావంతో ముందుకు నడవాలని సూచించారు. పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ బీజేడీ మాజీ జిల్లా అధ్యక్షుడి వ్యవహార శైలి ఈ పరాజయానికి కారణమైందన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జేకే పూర్ నుంచి తెరువలి మధ్యలో రహదారిపై పొగమంచు

• అలుముకున్న పొగమంచు

రాయగడ జిల్లాలోని జేకేపూర్ నుంచి తెరువలికి వెళ్లే రహదారిలో శుక్రవారం పొగమంచు అలముకుంది. ఉదయం 8 గంటల ప్రాంతంలో కూడా మంచు వీడకపోవడంతో వాహన చోదకులు ఇబ్బంది పడ్డారు. - రాయగడ





న్యూస్‌రీల్

ఉత్తమ ఎలక్టోరల్ ఆఫీసర్‌గా కలెక్టర్‌కు అవార్డు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ఎలక్టోరల్ అధికారిగా జిల్లా ఎన్నికల అధికారి (డిఈఓ), కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఎంపికయ్యారు. ఈ 2024 ప్రత్యేక ఓటర్ల సమ్మరీలో ఎక్కువ సేవలు అందించినందుకు, ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొన్నందుకు కలెక్టర్‌కు నూతన ఓటర్ల దినోత్సవం సందర్భంగా అవార్డు ఇవ్వనున్నారు. ఆయనతో పాటుగా జిల్లాలో ఓటర్ల ప్రత్యేక సమ్మరీలో ఉత్తమ సేవలు అందించిన మరో నలుగురికి ఈ అవార్డులు దక్కనున్నాయి. కలెక్టర్‌తో పాటు శ్రీకాకుళం మండలం తహసీల్దారు (ఎఈఆర్వో), ఇద్దరు బీఎల్ఓలు, పలాస అసెంబ్లీ నియోజవర్గంలోని బీఎల్ఓ ఐ.నీలవేణి, శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గంలోని బీఎల్ఓ వంజరాపు జగన్నాథరావు, కలెక్టరేట్ సి సెక్షన్ టెక్నికల్ సపోర్టర్ ఎం.సత్యనారాయణలు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. వీరికి శనివారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు

టెక్కలి: కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఆలయ హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ జీవీబీఎస్ రవికుమార్, ఆలయ కార్య నిర్వహణాధికారి వి.రాధాకృష్ణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు చేపట్టారు. సుమారు 55 రోజులకు రూ.3,61,145 ఆదాయం వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామపెద్ద బి.గోవిందరాజుతో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికులకు మద్యం షాపుల కేటాయింపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నూతన మద్యం పాలసీలో భాగంగా శుక్రవారం కలెక్టరేట్‌లో పది శాతం మద్యం దుకాణాలను అంటే 16 దుకాణాలను గీత కార్మికులకు కేటాయించారు. లాటరీ విధానంలో నిర్వహించిన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆధ్వర్యంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు జిల్లా అధికారు సీహెచ్ తిరుపతినాయుడు, సీఐ ఎంవీ గోపాలకృష్ణ పాల్గొన్నారు. గౌడ కులస్తులకు ఇచ్ఛాపురం రూరల్ మండలంలోనూ, శ్రీశయన కులస్తులకు ఇచ్ఛాపురం పురపాలక సంఘం, సరుబుజ్జిలి, ఆమదాలవలస పురపాలక సంఘం, కవిటి, వజ్రపుకొత్తూరు, బూర్జ, నందిగాం, పాతపట్నం, మందస, పోలాకి, సెగిడి కులస్తులకు టెక్కలి, కంచిలి, కొత్తూరు, శ్రీకాకుళం నగరపాలక సంస్థ, యాత కులస్తులకు హిరమండలంలను కేటాయించారు.

ఆదిత్యుని హుండీ కానుకల ఆదాయం రూ.66.89 లక్షలు


హుండీ కానుకల లెక్కింపు జరుగుతున్న దృశ్యం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో హుండీ కానుకల లెక్కింపు ద్వారా రూ.66,89,389 లభించినట్లు ఆలయ ఈఓ వై.భద్రాజీ తెలియజేశారు. శుక్రవారం ఆలయ మండపంలో నిర్వహించిన కానుకల లెక్కింపులో నగదు రూపంలో రూ.63,88,254, చిల్లర రూపంలో రూ.3,01,135 లభించిందని, అలాగే 58 గ్రాముల బంగారం, 2 కేజిల 137 గ్రాముల వెండి వస్తువులు లభించాయన్నారు. గత ఏడాది నవంబర్ 19 నుంచి ఈనెల 23 వరకు హుండీల్లో లభించిన కానుకలను లెక్కించినట్లుగా ఈఓ తెలిపారు.

రోడ్డెక్కిన అన్నదాత

- గజపతి కలెక్టరేట్ వద్ద నవనిర్మాణ్ కృషక్ సంఘటన ఆధ్వర్యంలో ఆందోళన
- ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్


గజపతి స్టేడియం వద్ద నుంచి ర్యాలీగా బయలుదేరిన రైతులు

పర్లాకిమిడి: ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోళ్లలో జిల్లా అధికారులు అనుసరిస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ నవనిర్మాణ్ కృషక్ సంఘటన ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద శుక్రవారం ఆందోళన జరిపారు. ప్రధానంగా రైతుల వద్ద నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని, రంగుమారిన ధాన్యం తీసుకోవాలని, పత్తి, మొక్కజొన్న మండీల వద్ద కొనుగోళ్లు చేయాలని, రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని, తీసుకున్న రుణాలు మాఫీ చేయాలనే ఐదు డిమాండ్లతో గజపతి స్టేడియం నుంచి కలెక్టరేట్ వరకూ భారీ ర్యాలీ జరిపారు. కొంతమంది రైతులు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి డౌన్ డౌన్ అని నినాదాలు చేశారు. ర్యాలీలో నవ నిర్మాణ్ కృషక్ సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి అక్షయకుమార్, శేష్ దేవ్ నోందో, కన్వీనరు రంజిత్ పట్నాయక్, రైతు సంఘం నాయకులు సూర్యనారాయణ పట్నాయక్, ఉప్పలాడ, బాగుసల, కోర్సండ, అంకుడి, గురండి, ఏడోమైలు రైతులు పాల్గొన్నారు. కలెక్టర్ బిజయ కుమార్ దాస్ మహేంద్రగిరి టూర్‌లో ఉన్నందున ఏడీఎం రాజేంద్ర మింజ్ రైతు నాయకులతో మాట్లాడారు. శనివారం నుంచి అన్ని మండీలలో ఖరీఫ్ పంట కొనుగోళ్లు చేస్తామని ఏడీఎం రాజేంద్ర మింజ్ హామీ ఇచ్చారు. అయినా కలెక్టర్ వచ్చేవరకూ ఆందోళన విరమించేది లేదని రైతులు జైల్ రోడ్డు వద్ద రస్తారోకో ఆందోళన జరిపారు. మధ్యాహ్నం మూడు గంటల వరకూ రైతులు కలెక్టరేట్ వద్దే బైఠాయించారు. ఈ సందర్భంగా నవ నిర్మాణ్ కృషక్ సంఘటన్ రాష్ట్ర కార్యదర్శి అక్షయకుమార్ విలేకరులతో మాట్లాడుతూ.. అధికారులు ధాన్యాన్ని సక్రమంగా మండీల వద్ద కొనుగోళ్లు చేయాలన్నారు. లేటంటే ఐదు రోజుల తరువాత రైతులు రోడ్డెక్కుతారని హెచ్చరించారు.


జిల్లా కలెక్టరేట్ వద్ద ఆందోళనలో రైతులు


కలెక్టరేట్ మెయిన్ గేటు వద్ద జిల్లా రైతు సంఘాలు నిరసన


ర్యాలీగా వెళుతున్న అన్నదాత

ఘనంగా ఆలయ వార్షికోత్సవం


ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

జయపురం: సమితిలోని జాముండ పంచాయతీ బొడాపాడ గ్రామంలో మా బుడి ఠకురాణి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సూర్య పూజతో ప్రారంభించి పూజలు, యజ్ఞాలు శాస్త్రోక్తంగా చేపట్టారు. ఆలయ ధర్మకర్త కె.శ్రీనివాసరావు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న ప్రసాద కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

52 యూనిట్ల రక్తం సేకరణ


రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన నరేంద్రమహంతి


రక్తదానం చేస్తున్న ఔత్సాహికులు

జయపురం: కొరాపుట్ జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఎస్.కె.టి.రోడ్డు జయపురం వారు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 52 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. స్థానిక నెహ్రూనగర్ అగ్రసేన్ భవనంలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని జయపురం మున్సిపల్ చైర్మన్ నరేంద్రకుమార్ మహంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రక్తదానం మహత్తర మైనదన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. రక్తదానంపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. సకాలంలో అవసరమైన గ్రూపు రక్తం లభించక క్షతగాతలు, రక్తహీనులు మత్యువాత పడుతున్న సంఘటలను ఉన్నాయన్నారు. సమాజంలో రక్తం లేమి కారణంగా ఎవరూ మరణించకూడదంటే అర్హులందరూ రక్తదానానికి ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో జయపురం జిల్లా కేంద్ర ఆస్పత్రి రక్తభండార్ అధికారి డాక్టర్ చిన్మయ కుమార్ జెన, డాక్టర్ సభ్యసాచి మహాపాత్రో, జయపురం సబ్‌డివిజన్ రక్త దాతల మోటివేటెడ్ అసోసియేషన్ కార్యదర్శి ప్రమోద్ కుమార్ రౌళో, అసోసియేషన్ అధ్యక్షుడు డి.కష్టారావు, కార్యదర్శి కాళీ ప్రసాద్ పట్నాయక్ పాల్గొన్నారు.

విక్రమదేవ్ వర్సిటీలో జాతీయ సెమినార్


సెమినార్‌ను ప్రారంభిస్తున్న వీసీ దేవీప్రసాద్ మిశ్ర


వేదికపై అతిథులు

జయపురం: జయపురం విక్రమదేవ్ వర్మ విశ్వవిద్యాలయ శిక్షక శిక్షా (టీచర్స్ ఎడ్యుకేషన్) విభాగంవారు 'వికసిత్ భారత్ విజన్, చాలెంజెస్ అండ్ ఆపర్చూనిటాస్' అనే అంశంపై శుక్రవారం జాతీయ సెమినార్ ప్రారంభించారు. రెండు రోజులు నిర్వహించే సెమినార్‌ను వర్సిటీ కులపతి ప్రొఫెసర్ దేవీప్రసాద్ మిశ్ర ప్రారంభించారు. ఎన్‌సీఈఆర్‌టీ న్యూఢిల్లీ ప్రాక్తన్ డైరెక్టర్, భువనేశ్వర్ ప్రాంతీయ శిక్షా ప్రతిష్టాన్ ప్రొఫెసర్ డాక్టర్ హృషికేష్ సెనాపతి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆర్ఐఈ(ఎన్‌సీ.ఆర్‌టీ) రిటైర్డ్ ప్రిన్సిపాల్, స్టేట్ కరిక్యులం ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్ స్టీరింగ్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ నిత్యానంద ప్రధాన్ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఉన్నత విద్యా స్థానిక విభాగ డైరెక్టర్ డాక్టర్ గోపాల హల్దార్ గౌరవ అతిథిగా పాల్గొని వికసిత్ భారత్ విజన్‌లో విద్య, ఉపాధ్యాయుల పాత్రపై ప్రసంగించారు. ప్రసిద్ధ పత్రిక కుంధ కలిక, పాఠ్యాంశాలు, చిత్రకళా ప్రదర్శన నిర్వహించారు. అనంతరం సెమినార్ ప్రారంభించారు. సెమినార్‌లో ఆహ్వానితులు, స్నాతకోత్తర పరిషత్ అధ్యక్షులు డాక్టర్ ప్రచండ కుమార్ పాత్రో స్వాగతోపన్యాసం చేశారు. సెమినార్ కోఆర్డినేట్ కమిటీ కార్యదర్శి, శిక్షక శిక్షా విభాగ చీఫ్ డాక్టర్ మనోరంజన్ ప్రధాన్ సెమినార్ లక్ష్యాన్ని వివరించారు. సెమినార్ లో పాల్గొన్న వారికి జయపురం విక్రమదేవ్ విశ్వవిద్యాలయ అసిస్టెంట్ ప్రొఫెసర్ లోకేష్ ప్రధాన్ ధన్యవాదాలు తెలియజేశారు.

మావోయిస్టుల మృతదేహాల గుర్తింపు


ఒడిశాకు చెందిన ఆలోక్ మృతదేహం | సత్యం మృతదేహం | ఒడిశా చీఫ్ సెక్రటరీ చలపతి మృతదేహం | శంకర్ ఏసీఎం సభ్యుడు | కల్కు దేవే గుడ్డు కపల దారి ఏసీఎం సభ్యురాలు | మంజు ఏసీఎం సభ్యురాలు | రింకి మృతదేహం


సుఖ్రామ్ మృతదేహం పార్టీ సభ్యుడు | రామె ఒరమ్ మృతదేహం | జైనీ.. పార్టీ సభ్యురాలు | మను మృతదేహం

మల్కన్‌గిరి: ఒడిశా–చత్తీస్‌గఢ్ సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో 16 మంది మావోలు మృతి చెందిన విషయం తెలిసిందే. వారిలో 12 మంది మృతదేహాలను చత్తీస్‌గఢ్ పోలీసులు గుర్తించారు. వారిలో ఒడిశా స్టేట్ చీఫ్ సెక్రటరీ చలపతితోపాటు ఒడిశా స్టేట్ కమిటీ సభ్యులు ఆలోక్ శేఠి అలియాస్ మున్నా ఉరఫ్ బౌరీబంధు శేఠి ఉన్నారు. ఈయన స్వస్థలం ఒడిశా కటక్ జిల్లా నియాలి పోలీసు స్టేషన్ పరిధిలోని కులశ్రీ గ్రామం. ఈయనపై రూ.18 లక్షల రివార్డు ఉంది. ఆలోక్ శేఠి 20 ఏళ్లుగా దళంలో పని చేస్తున్నారు. డిగ్రీ చదువుతున్న సమయంలో 2003లో మావోయిస్టులతో కలిశాడు. అప్పటి నుంచి మావో అగ్ర నేతలు అయిన ఆర్కే, చలపతిలకు కుడి భుజంగా మెలిగాడు. ఆలోక్ చివరకు చలపతితోనే చనిపోయాడు. ఈ మృతుల్లో మరో ఇద్దరు స్టేట్ కమిటీకి చెందిన మావో అగ్రనేతలు జయరామ్ అలియస్ గుడ్డు, సత్యంలను గుర్తించారు. వీరిపై కూడా ఒక్కొక్కరిపై రూ.65 లక్షల చొప్పున రివార్డు ఉంది.

రాష్ట్రంలో పీఎం ఆవాస్ యోజన సర్వే ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రధాన మంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) కింద విస్తృమైన గృహ నిర్మాణ సర్వే శుక్రవారం ప్రారంభించారు. పూరీ జిల్లా పిప్పిలి మండలం జసువాపూర్ గ్రామ పంచాయతీ అర్జున్‌సింగ్‌పూర్ గ్రామం నుంచి రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి రబీ నారాయణ్ నాయక్ ఈ సర్వేను లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మంత్రి ముచ్చటించారు. మొబైల్ యాప్ ద్వారా సర్వే నిర్వహిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, ల్యాండ్‌లైన్ ఫోన్‌లు ఉన్న కుటుంబాలను కూడా ఈ సర్వేలో చేర్చవచ్చని మంత్రి ప్రకటించారు. దీంతో కుటుంబ ఆదాయ పరిమితిని రూ.15,000కు పెంచడం విశేషంగా పేర్కొన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద ప్రయోజనం పొందేందుకు అర్హత ప్రామాణికాల్ని స్వల్పంగా సడలించారు. ఈ నేపథ్యంలో కుటుంబ నెలసరి ఆదాయ పరిమితిని రూ.15,000కు పెంచుతూ ద్విచక్ర వాహనాలు, రిఫ్రిజిరేటర్లు, ల్యాండ్‌లైన్ ఫోన్‌లు ఉన్న కుటుంబాలను తాజా సర్వేలో చేర్చనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. కుటుంబాల నుంచి విడిపోయిన వ్యక్తులకు తాజా సర్వేలో పీఎంఏవై వసతి కల్పిస్తారు. తల్లిదండ్రులకు దూరంగా ఉన్న వ్యక్తులు లేదా భర్తల నుండి విడిపోయి స్వతంత్రంగా జీవిస్తున్న మహిళలు (భార్య) పీఎంఏవై పథకంలో చేర్చేందుకు పరిగణిస్తారు. ఇది కాకుండా ఇంతకుముందు దరఖాస్తు చేసి ఇళ్ల కేటాయింపు కోసం నిరీక్షిస్తున్న మరోమారు దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి తెలిపారు. దరఖాస్తు ప్రక్రియను కూడా సరళీకరించారు. అర్హులైన లబ్ధిదారులు ఆఫ్‌లైన్ ఆన్‌లైన్ ద్వారా పీఎంఏవై ప్రయోజనాలను పొందేందుకు దరఖాస్తు చేసుకునేందుకు సౌలభ్యం కల్పించారు. సర్వే ప్రారంభమైన తొలి రోజు నుంచి ఆన్‌లైన్ పోర్టల్ యాక్టివేట్ అయినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు ప్రజలు పంచాయతీ ఆధ్వర్యంలో లేదా మొబైల్ అప్లికేషన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని మంత్రి రబీ నాయక్ తెలిపారు. ప్రభుత్వం అర్హత ప్రామాణికల్ని అప్‌డేట్ చేశారు. అర్హులైన లబ్ధిదారులలో గరిష్ట నమోదు లక్ష్యంతో దరఖాస్తు రుసుమును తొలగించారు. తాజా సర్వే 6 నుంచి 8 వారాల పాటు కొనసాగుతుంది. పీఎంఏవై ఇళ్ల కేటాయింపు 2 కోట్ల నుంచి 3 కోట్లకు పెంచనున్నట్లు మంత్రి ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్త సర్వేలో గత సర్వేలో అర్హులై కూడా లబ్ధి పొందని వారికి తాజా సర్వే ఉపకరిస్తుంది. గత సర్వేలో 50,963 కు పైగా దరఖాస్తులు పరిశీలనకు నోచుకోకుండా మూలుగుతున్నాయి. సర్వేతో అర్హులైన వారికి అన్యాయం జరగకుండా అండగా నిలుస్తుంది.

శ్రీసూర్యనారాయణా.. మేలుకో!



- ఆక్రమణకు గురైన దేవస్థానం భూమి
- దేవస్థానం భూమిలో లేఔట్ కోసం రోడ్డు నిర్మాణం
- దేవస్థానం భూములకు ఆనుకుని ఉన్న ఇరిగేషన్ కాలువపై అక్రమంగా వంతెన నిర్మాణం
- అనుమతుల్లేకుండానే నిర్మాణాలు
- దేవస్థానం హెచ్చరిక బోర్డును తొలగించి రోడ్డు వేసిన అక్రమార్కులు


ఇరిగేషన్ కాలువపై అనుమతి లేకుండా నిర్మించిన వంతెన ఇది. అవతల భూముల్లో లేఔట్ వేసేందుకు, దానికి రహదారి కోసం నిర్మించిన వంతెన ఇది. దీనికి ఎలాంటి అనుమతుల్లేవని ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. అరసవల్లి దేవస్థానానికి కూత వేటు దూరంలో ఉన్న వాదాడ పంచాయతీ పరిధిలో గల కాలువపై వంతెన నిర్మించారు.

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అరసవల్లి ఆదిత్యుడి భూములు ఆక్రమణలకు గురవుతున్నాయి. అవతల ఉన్న లేఔట్ భూముల కోసం దేవస్థానం భూముల్ని ఆక్రమించి రోడ్డు వేసేశారు. సర్వే నంబర్ 130లో గల 0.873 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూమిలోని కొంత భాగంలో ఈ రోడ్డు నిర్మించారు. అంతేకాదు ఇరిగేషన్ అధికారుల అనుమతి లేకుండా దేవస్థానం భూముల పక్కనే ఉన్న ఇరిగేషన్ కాలువపై అడ్డంగా, అక్రమంగా వంతెన కూడా నిర్మించారు. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో, సూర్యనారాయణస్వామి దేవస్థానానికి దగ్గర్లలోనే ఈ భూ బాగోతం చోటు చేసుకుంది. ఆ వ్యక్తులు అంతటితో ఆగడం లేదు. నిర్మించిన వాటికి అనుమతులివ్వాలని కాలువ అవతల జిరాయితీ భూములున్న వ్యక్తులతో దరఖాస్తులు చేయించడం చర్చనీయాంశమవుతోంది.

ఇరిగేషన్ కాలువ అవతల ఉన్న భూముల్లో లేఔట్ వేసి లబ్ధిపొందేందుకు పన్నిన పన్నాగమిది. అలాగని, ఆ కాలువ అవతల ఉన్న భూములకు రోడ్డు లేకపోవడం వల్ల ఈ వంతెన నిర్మించి, రోడ్డు వేశారనుకుంటే అదీ కాదు. కాలువ అవతల భూములకు పక్కా రోడ్డు ఉంది. అటువైపు పండిన పంటలను తరలించేందుకు ఆ రోడ్డును ఇప్పటికే వినియోగిస్తున్నారు. దేవస్థానం భూమిలో వేసిన రోడ్డు, ఇరిగేషన్ కాలువపై నిర్మించిన వంతెన కేవలం రియల్ ఎస్టేట్‌కు మాత్రమే ఉపయోగపడుతోంది. ఇదంతా పక్కా పథకం ప్రకారం జరిగింది. దీనివెనక ఎవరున్నారో వారికి ఎవరి అండదండలు ఉన్నాయో తేలాల్సిన అవసరం ఉంది. అధికార పెద్దల హస్తం లేకుండా అంతగా బరితెగించే అవకాశం ఉండదు.


ఈ ఫొటో చూడండి. అనధికారికంగా అరసవల్లి దేవస్థానం భూముల్లో రోడ్డు వేశారని తెలుసుకుని దేవదాయ శాఖ అధికారులు అక్కడికెళ్లి...ఈ భూమి అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి వారి దేవస్థానానికి చెందినది. ఆక్రమణదారులు శిక్షార్హులని బోర్డు పెట్టిన దృశ్యమిది.


ఆ వంతెనకు కలుపుకుని కొత్తగా నిర్మించిన రోడ్డు ఇది. ఇది కూడా అక్రమంగానే వేశారు. అరసవల్లి దేవస్థానం భూములను ఆక్రమించి రోడ్డు వేసేశారు. విలువైన భూమిని అవతల ఉన్న తమ లేఔట్ కోసం రోడ్డుగా మార్చేశారు.

ఈ ఫొటో చూడండి. ఆక్రమణదారులు శిక్షార్హులని దేవాదాయ శాఖాధికారులు పెట్టిన బోర్డును పీకేసి యథేచ్ఛగా చదును చేసి, అక్రమంగా రోడ్డేసిన దృశ్యమిది. అక్రమార్కుల బరితెగింపునకు నిదర్శనమిది.



అనుమతుల్లేకుండా వంతెన నిర్మాణం

ఇరిగేషన్ కాలువపై వంతెన నిర్మాణానికి ఎలాంటి అనుమతులు ఇవ్వలేదు. అక్రమంగా నిర్మించిన వంతెనపై చర్యలు తీసుకుంటాం. తహసీల్దార్‌తో కలిసి పరిశీలించి వంతెన కట్టడంపై చర్యలు చేపడతాం. ఇరిగేషన్ కాలువలపై ఇటువంటి అక్రమ కట్టడాలు చేపడితే చర్యలు తప్పవు. – పొన్నాడ సుధాకర్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, జల వనరుల శాఖ

మహేంద్రగిరి అభివృద్ధికి ప్రణాళికలు


మహేంద్రగిరిలో రాష్ట్ర మంత్రి బిభూతి జెన్నా పర్యటన

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ బ్లాక్ మహేంద్రగిరిలో రాష్ట్ర వాణిజ్య, రవాణా, ఖనిజశాఖ మంత్రి బిభూతీ భూషన్ జెన్నా శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మిక పర్యటన చేశారు. ఆయన వెంట కలెక్టర్ బిజయ కుమార్‌దాస్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు. మహేంద్రగిరి పర్వతం సందర్శించిన రాష్ట్ర మంత్రి జెన్నా అనంతరం రాయగడ బ్లాక్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. మహేంద్రగిరిని ఒక ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా రూపొందించాలన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు మహేంద్రగిరి అభివృద్ధికి ఒక ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటుచేస్తాయని అలాగే ఈ కమిటీలో మహేంద్రగిరి ప్రాంతం ఆదివాసీలు కూడా సభ్యులుగా ఉంటారని అన్నారు. మహేంద్రగిరి ప్రాధాన్యతకు ఇక్కడ ఒక సంగ్రహాలయం, పర్యాటకులు నిత్యమూ చేరుకోవడానికి బ్యాటరీ ఆటోలు, బుర్ఖాత్ పాస్ నుంచి విద్యుత్ వెలుగులు నిర్మిస్తామని అన్నారు. భీమ మందిరం నుంచి దారుబ్రహ్మ వరకూ రైలు సౌకర్యం ఏర్పాటుకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను సంప్రదిస్తామని రాష్ట్ర మంత్రి జెన్నా సమీక్షలో వెల్లడించారు. అలాగే కోయిపూర్‌లో ఒక పోలీసు అవుట్ పోస్టు ఏర్పాటుచేస్తామని దీని వల్ల పర్యాటలకులు భద్రత ఉంటుందని అన్నారు. ఈ పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన అంచనాలు రూపొందించి ప్రారంభిస్తామని మంత్రి బిభూతి భూషన్ జెన్నా విలేకరులకు వెల్లడించారు. సమీక్ష సమావేశంలో రాయగడ చైర్మన్ పూర్ణబాసి నాయక్, అంతర్యామి గోమాంగో, సబ్ కలెక్టర్ అనుప్ పండా, బి.డీ.ఓ. సుధీర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.


మహేంద్రగిరి వద్ద రాష్ట్ర రవాణా శాఖ మంత్రి బిభూతి జెన్నాను ఆహ్వానిస్తున్న కలెక్టర్


రాయగడ బ్లాక్ కార్యాలయంలో రాష్ట్ర మంత్రి బిభూతి జెన్నా అధికారులతో సమీక్ష సమావేశం

క్లుప్తంగా

బోడసింగిపేటలో నగదు, బంగారం చోరీ

బొండపల్లి: మండలంలోని బోడసింగిపేట గ్రామంలో శుక్రవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి బయటకు వెళ్లి సాయంత్రం వచ్చి చూడగా బీరువా తాళాలు పగులగొట్టి అందులోని నగదు, బంగారం చోరీ చేసినట్లు బాధితురాలు ఎస్.దుర్గాభవాని ఫిర్యాదు చేసినట్లు ఎస్సై యు.మహేష్ తెలిపారు. దుర్గాభవాని, భర్త సూర్యరారాయణరాజుతో కలిసి తమ పిల్లలను విశాఖ పట్టణంలోని కాలేజీకి తీసుకుని వెళ్లి సాయంత్రం ఇంటికి చేరుకుని పరిశీలించి చోరీ జరిగినట్లు గుర్తించి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. ఫిర్యాదుదారు లక్ష రుపాయల నగదుతో పాటు, రెండు తులాల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొనగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి ఆత్మహత్యా యత్నం


చికిత్స పొందుతున్న పారయ్య

గుమ్మలక్ష్మీపురం: గడ్డి మందు తాగి ఓ యువకుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకుంది. ఎల్విన్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు... మండలంలోని బుడ్డెమ్మఖర్జ గ్రామానికి చెందిన పాదిలాపు పారయ్య వ్యక్తిగత కారణాలతో ఇంట్లో వున్న గడ్డి మందును తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం తరలించారు. ప్రాథమిక చికిత్సను అందించిన సిబ్బంది మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధిద్దాం..


వలంటీర్లకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న ఎంఎంఎస్ అధ్యక్షురాలు లలితకుమారి

వీరఘట్టం: ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా ప్రతి పల్లెలో సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని వయోజన విద్య ఎ.డి వైకుంటరావు సూచించారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో 133 మంది ఉల్లాస్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి వలంటీర్ తన పరిధిలో పది మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం వలంటీర్లకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. సమావేశంలో ఎంపీడీఓ బి.వెంకటరమణ, ఎంఎంఎస్ అధ్యక్షురాలు కె.లలితకుమారి, ఏపీఎం కె.రాము, తదితరులు పాల్గొన్నారు.

ఒడియా పాఠశాలలు కొనసాగించాలి..


మాట్లాడుతున్న ఏపీఓటీపీ సంఘ ప్రతినిధులు

భామిని: రాష్ట్ర ప్రభుత్వం జీఓ 117 రద్దు చేసిన తర్వాత ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ఒడియా మాధ్యమం, ఒడియా సెక్షన్ గల బైలింగ్విల్ పాఠశాలల భవితవ్యం అయోమయంలో పడిందని భామిని ఒడియా టీచర్ల సంఘం (ఏపీఓటీపీ) అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.సుశీలా, ఎన్.రాజశేఖర్ ఆందోళన వ్యక్తం చేశారు. బత్తిలి జెడ్పీహెచ్ స్కూల్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఒడియా లాంగ్వేజ్ పాఠశాలలను తెలుగు,ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో విలీనం చేయకూడదన్నారు. ఒడియా మీడియం పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

మడ్డువలస ప్రాజెక్టు పరిసరాల్లో కొండచిలువలు


మడ్డువలస వద్ద హతమార్చిన కొండచిలువ

వంగర: మండల పరిధి మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు చుట్టూ కొండచిలువలు, విషసర్పాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిమట్టం నమోదు కావడంతో ప్రాజెక్టు పరిసర గ్రామాల చుట్టూ ప్రాజెక్టులో నీరు చేరింది. దీంతో కొండచాకరాపల్లి, ఎం.సీతారాంపురం, పటువర్థనం, శ్రీహరిపురం, కొప్పర, గీతనాపల్లి తదితర గ్రామాల సమీపంలో కొండచిలువలు అలజడి సృష్టించడంతో పలు చోట్ల వాటిని హతమారుస్తున్నారు. అలాగే కొండచిలువలు గ్రామాల్లోకి ప్రవేశించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. విషసర్పాలతో భయంగా ఉందని, ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీటిమట్టం తగ్గించాలని ప్రాజెక్టు తీర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

హద్దు మీరి అక్రమ రవాణా

- ఒడిశాకు తరలుతున్న పీడీఎస్ బియ్యం
- స్థానికంగా కొనుగోలు చేసి తరలింపు
- జిల్లాలో ఆరు నెలల కాలంలో కేవలం 18 కేసులు
- 415 క్వింటాళ్ల బియ్యం పట్టివేత

ఆరు నెలల్లో పీడీఎస్ బియ్య కేసుల వివరాలు..	
కేసులు	15
క్రిమినల్ కేసులు	9
సీజ్ చేసిన బొలేరో వాహనాలు	8
సీజ్ చేసిన ఆటోలు	4
స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం	415 క్వింటాళ్లు


డిసెంబర్ 8న ఒడిశా రాష్ట్రం అలమండ బ్లాక్‌కు 2400 కేజీల పీడీఎఫ్ బియ్యాన్ని తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన వాహనం

పార్వతీపురంటౌన్: పీడీఎస్ బియ్యం అక్రమంగా రాష్ట్ర సరిహద్దులు దాటుతోంది. చౌకధరల డిపోల నుంచి పేదలకు అందాల్సిన బియ్యం వ్యాపారంగా మారిపోయింది. కిలోల నుంచి టన్నుల వరకు పెద్ద మొత్తంలో విక్రయిస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. స్థానికంగా కొనుగోలు చేసి రాష్ట్ర సరిహద్దులను దాటిస్తున్నారు. పీడీఎస్ బియ్యానికి కిలో రూ.20 నుంచి రూ.25 వరకు డిమాండ్ ఉంది. కొన్ని ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో బియ్యం సరిగా పంపిణీ చేయడం లేదనే విమర్శలున్నాయి. ఈ క్రమంలో చాలా మంది రేషన్‌డీలర్ల నుంచే అక్రమార్కులకు బియ్యం అందుతున్నాయనే ఆరోపణలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. సరిహద్దు రాష్ట్రమైన ఒడిశాకు బియ్యం సరఫరా అవుతోంది. అడపాదడపా విజిలెన్స్ సిబ్బంది అక్రమ రవాణా చేస్తున్న బియ్యాన్ని పట్టుకుంటున్నప్పటికీ సరఫరా మాత్రం ఆగడం లేదు.

కిలో రూ.20 నుంచి రూ.25 వరకు..

చౌకధరల డిపోల నుంచి పేద ప్రజలకు అందే బియ్యం పక్కదారి పట్టడం విమర్శలకు తావిస్తోంది. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లు, 15 మండలాల నుంచి బియ్యం సేకరిస్తుంటారు. గత ఆరు నెలల నుంచి రేషన్ బియ్యం అక్రమ రవాణా ఎక్కువైందన్న విమర్శలు వస్తున్నాయి. ఒక్కో ప్రాంతంలో డిమాండ్‌ను బట్టి కేజీ బియ్యం రూ.20 నుంచి రూ.25 వరకు కొనుగోలు చేస్తున్నారు. కొంత మంది ఈ బియ్యాన్ని ఎక్కువగా ఒడిశా రాష్ట్రానికి తరలిస్తున్నారు. మరికొంతమంది తూర్పు గోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు.

స్థానిక కూటమి నాయకుల అండదండలతో

జిల్లాలో మైదాన ప్రాంతాలతో పాటు చుట్టుపక్కల గిరిజన ప్రాంతాల నుంచి స్థానిక కూటమి నాయకుల అండదండలతో పీడీఎస్ బియ్యం సరిహద్దులు దాటుతోంది. పదులు, వందల కేజీలు కాదు ఏకంగా వేలటన్నుల్లో బియ్యం చేరుకుంటోందని సమాచారం. కొందరు రైస్ మిల్లర్లు ఆ బియ్యాన్ని పాలిష్ చేయించి అక్రమంగా రవాణా చేస్తుంటారు. అక్కడ మంచి ధరకే విక్రయించి బాగానే సొమ్ము చేసుకుంటారని తెలుస్తోంది. ఈ నెలలో పెద్ద మొత్తంలో పీడీఎస్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. జిల్లా సరిహద్దు దాటే వాహనాలు నేరుగా వెళ్తాయనే ప్రచారం ఉంది. ఈ అక్రమ వ్యాపారం బయటకు పొక్కకుండా ఉండేందుకు కూటమి నాయకులకు మామూళ్లు అందుతాయట. దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు ఆదాయం ఏస్థాయిలో వస్తోందో.


పార్వతీపురం రైల్వేస్టేషన్ వద్ద ఆదివారం రైలులో పట్టుకున్న పీడీఎస్ బియ్యం


ఒడిశా రాష్ట్రం అలమండకు బొలెరో వాహనంలో పీడీఎస్ బియ్యం తరలిస్తుండగా పట్టుకున్న అధికారులు (ఫైల్)

మూలాలను గుర్తించడంలో విఫలం..

ఆరు నెలలుగా పీడీఎస్ బియ్యం రవాణా జరుగుతూనే ఉంది. కొన్ని సందర్భాల్లో బియ్యం పట్టుబడినా, సంబంధిత నిందితులు అరెస్టయినా అక్రమ రవాణా ఆగడం లేదు. దీనికి ప్రధాన కారణం అసలైన మూలాలను పట్టుకోలేకపోవడమేనని తెలుస్తోంది. ఇందులో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. విజిలెన్స్, పోలీసులు దృష్టి సారిస్తున్నా బియ్యం అక్రమ రవాణాను నియంత్రించలేకపోతున్నారు. ప్రతి మండల పరిధిలో ఇద్దరి నుంచి ఐదుగురి వరకు క్షేత్రస్థాయిలో పీడీఎస్ బియ్యం సేకరించి విక్రయిస్తున్నట్లు సమాచారం. వారి నుంచి పెద్ద మొత్తంలో ఒడిశాకు సరఫరా చేసే వారికి సంబంధాలున్నట్లు తెలుస్తోంది. ఎవరెవరు బియ్యాన్ని సేకరించి, అమ్ముతుంటారో అధికారులకు స్పష్టంగా తెలుసు. కానీ వారందరూ యథేచ్ఛగా విక్రయాలు చేస్తున్నా పట్టించుకోకపోవడానికి కూటమి నాయకుల ఒత్తిడే కారణమని తెలుస్తోంది.

విధిగా కేసులు నమోదు చేస్తున్నాం

పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. ఒడిశా సరిహద్దు గ్రామాల్లో విజిలెన్స్ అధికారులతో దాడులు నిర్వహించి కేసులు నమోదు చేస్తున్నాం. అక్రమ రవాణాకు పాల్పడితే చట్టపరమైన చర్యలు చేపడతాం. వాహనాలు సీజ్ చేసి నిందితులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నాం. ఈ నెలలో పోలీసులు, విజిలెన్స్ అధికారులతో కలిసి 5 కేసులు నమోదు చేశాం.

– రాజేంద్ర, సీఎస్‌డీటీ, పార్వతీపురం

బాలికల సంరక్షణ అందరి బాధ్యత


భామిని:కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సత్యం

- సీడీపీఓ శాంతి

భామిని: బాలికల సంరక్షణ అందరి బాధ్యతని సీడీపీఓ శాంతి అన్నారు. శుక్రవారం స్థానిక కేజీబీవీలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ కె.సత్యం, ఎంఈఓ ఎ.శ్రీనివాస్, ఏపీఓ తులసీదాస్ పాల్గొని బాలికల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఎస్ఓలు సబితా పట్నాయక్, జ్యోతిలక్ష్మి, మహేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతంపేటలో..

సీతంపేట: జాతీయ బాలిక దినోత్సవాన్ని పురస్కరించుకుని సీతంపేటలో విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక హైస్కూల్ నుంచి అడ్వంచర్ పార్కు వరకు ర్యాలీ సాగింది. కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీఓ చిన్నబాబు, ట్రైబుల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, సీఎంఓ చిరంజీవి, జీసీడీఓ రాములమ్మ, హెచ్‌డబ్ల్యూఓ పి.అమల, ఏఎస్సై సంజీవ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.


సీతంపేట: సీతంపేటలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, అధికారులు


పాలకొండ రూరల్: ప్రచార పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సంస్థ సభ్యులు

జనచేతన ఆధ్వర్యంలో..

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో జనచేతన సంస్థ కార్యదర్శి బగాది శశిభూషణ చౌదరి ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల విద్య, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాల కార్మికులు, విద్యాహక్కు చట్టం, తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీనిధి నిధులు పక్కదారిపై విచారణ

- సహకరించని గ్రూప్‌సభ్యులు
- విచారణ వాయిదా

సాక్షి ఎఫెక్ట్

బొబ్బిలిరూరల్: మండలంలోని ముత్తాయవలస గ్రామంలో పొదుపు సంఘాలకు స్త్రీనిధి ద్వారా అందించిన నిధులు పక్కదారి పట్టడంపై సాక్షి గురువారం స్త్రీనిధి నిధులు పక్కదారి అనే కథనాన్ని ప్రచురించగా స్త్రీనిధి జిల్లా ఏజీఎం ఉమామహేశ్వరరావు స్పందించి శుక్రవారం గ్రామంలో విచారణ చేపట్టారు. గ్రామంలోని రామమందిరం వద్ద నిర్వహించిన ఈ విచారణలో ముందుగా లూర్దమాత పొదుపు సంఘంలోని నలుగురు మహిళలకు అందాల్సిన రుణాలను మరొకరికి అందజేసినట్లు తేలింది. దీంతో విచారణాధికారి ఉమామహేశ్వరరావు వారిని, వీఓఏను హెచ్చరించారు. రుణాలు తీసుకున్న వారికి ప్రత్యేకంగా ఇన్సూరెన్స్ ఉంటుందని, రుణగ్రహీతలు మరణిస్తే వారికి బీమా వర్తింపు ద్వారా రుణమాఫీ జరుగుతుందని, ఇతరులకు ఈ రుణాలను తీసుకుని వారు మరణిస్తే ఆ రుణం ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అలాగే రుణగ్రహీత బయోమెట్రిక్ ద్వారా మాత్రమే రుణం పొందగలరని, ఎలా ఇతరులకు ఈ రుణాలను అందజేశారో తెలియజేయాలని వీఓఏ సీతారాంను మందలించారు. విచారణ జరుగుతున్న సమయంలో మరి కొన్ని పొదుపు సంఘాల సభ్యులు, వారి కుటుంబసభ్యులు గుంపుగా చేరి విచారణను అడ్డుకున్నారు. విచారణ అవసరంలేదని తీవ్ర వాగ్వాదం, గందరగోళం సృష్టించడంతో ఏజీఎం విచారణను అర్ధాంతరంగా నిలిపివేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటువంటి సమయంలో విచారణ జరపలేమని, త్వరలో జిల్లా నుంచి విచారణ బృందం ద్వారా విచారణ జరుపుతామని తెలియజేశారు. కాగా ఇంకా గ్రామంలో మరో 10 సంఘాలలో ఇటువంటి రుణాలు ఇతర వ్యక్తులకే వెళ్లినట్లు, ఆయా సంఘాలను కూడా పూర్తిస్థాయిలో విచారణ చేయాలని ఆయా సంఘాల సభ్యులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలక్ష్మి, సీసీలు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


ఇతరుల పేరుతో రుణాలను పొందిన వారిని ప్రశ్నిస్తున్న ఏజీఎం ఉమామహేశ్వరావు

వైభవంగా సహస్ర దీపారాధన

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవను ఆలయ అర్చకులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తూర్పురాజగోపురం సమీపంలోని వేదికపై ఉన్న ప్రత్యేక ఊయలలో సీతారామచంద్ర స్వామిని ఆసీనులను చేసి సహస్ర దీపాల కాంతుల శోభలో పవళింపు సేవ జరిపించారు. సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో సహస్ర దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారు.


రామతీర్థంలో ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

ముగ్గురికి గాయాలు


గాయాలైన వారిని 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద శుక్రవారం బైక్‌పై వెళ్తున్న వ్యక్తి సైకిల్‌పై వస్తున్న వ్యక్తిని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైనట్లు ఎస్ బూర్జవలస ఎస్సై రాజేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం రామభద్రపురం నుంచి గజపతినగరం వైపు బైక్‌పై వస్తున్న ప్రదీప్, నజామా బేగంలు షికారుగంజి కూడలి వద్దకు వచ్చేసరికి ఎస్ చింతలవలస నుంచి యడ్ల సత్యనారాయణ సైకిల్ తొక్కుకుంటూ జాతీయ రహదారి దాటుతుండగా ఢీకొట్టడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. వెంటనే ఆ ముగ్గురిని 108లో గజపతినగరం సామాజిక ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రీ సర్వేలో డాక్యుమెంట్లు పక్కాగా విచారించాలి

- సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీ వాస్తవం

పార్వతీపురంటౌన్: రీసర్వే పనుల్లో డాక్యుమెంట్లను పక్కాగా విచారణ చేపట్టాలని పార్వతీపురం సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ ఆదేశించారు. పార్వతీపురం మండలంలోని గోపాలపురం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి రీ సర్వే పనులను తనిఖీచేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే చేపడుతున్న గ్రామాల్లో ముందుగా సమాచారం అందించాలని, తగు రసీదులు పొందాలని స్పష్టం చేశారు. భూముల రీ సర్వేలో తలెత్తిన లోపాలను భూయజమానికి ముందుగా నోటీసులో అందించాలని, తద్వారా తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివాదాస్పద భూములకు సంబంధించిన వివరాలు ఆయా రిజిస్టర్లలో నమోదు చేయాలని చెప్పారు. రీసర్వేలో ఎక్కడా లోపాలు ఉండరాదని అందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. రీ సర్వే తర్వాత తప్పులు లేని భూ రికార్డులు నెలకొల్పాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

గడ్డివాములు దగ్ధం

- 20 బస్తాలు ధాన్యం అగ్నికి ఆహుతి
- లబోదిబో మంటున్న రైతు


మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్న ఎస్.కోట అగ్నిమాపక సిబ్బంది

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని పట్టాలమ్మతల్లి గుడి సమీపంలో గల సంఘం చిన్నారావుకు చెందిన గడ్డివాములు, 20 బస్తాల ధాన్యం శుక్రవారం జరిగిన అగ్నిప్రమాదంలో కాలిబూడిదయాయి. ఈ ప్రమాదానికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల మేరకు రైతు చిన్నారావు తనకు ఉన్న నాలుగు ఎకరాల్లో వరి పంట వేసి నూర్పు చేసి కళ్లంలో గడ్డిమేటలు వేశారు. అలాగే సమీప రైతు నుంచి నాలుగు ఎకరాల్లో గడ్డిని కొనుగోలు చేసి మొత్తంగా 8 ఎకరాల్లో గడ్డి మేట్లు వేశాడు. ఈ గడ్డి మేట్ల కింద 20 బస్తాల ధాన్యం నిల్వ చేశాడు. కాగా శుక్రవారం మధ్యాహ్నం ఎలా జరిగిందో ఏమో తెలియదు గాని గడ్డివాముల నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.10 నిమిషాల వ్యవధిలో గడ్డివాములకు మొత్తం అగ్నికీలలు వ్యాపించాయి.దీంతో ఎస్.కోట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నం చేశారు. అప్పటికే గడ్డి, ధాన్యం పూర్తిగా కాలిబూడిదయాయి. దీంతో రైతు చిన్నారావు లబోదిబోమంటూ రోదించాడు. చిన్నారావుకు జరిగిన నష్టంపై అంచనా వేసి ఉన్నతాదికారులకు నివేదిస్తామని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

ఆలయానికి చేరుకున్న స్వామివారి విగ్రహాలు



గరుగుబిల్లి: తోటపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 5 నుంచి 8వ తేదీ వరకు విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా తిరుపతి నుంచి శ్రీదేవి, భూదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహాలను పార్వతీపురం నుంచి మేళ తాళాలతో భక్తుల నడుమ అత్యంత వైభవంగా ఆలయానికి తరలించారు. విగ్రహాలను చూసేందుకు పరిసర గ్రామ ప్రజలు, భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో టీటీడీ కమిటీ సభ్యులు, భక్తులు, దాతలు పాల్గొన్నారు.

గిరిజన ఉత్పత్తులను గరిష్ట ధరకు విక్రయించాలి


గిరిజన ఉత్పత్తుల ధరలపై వివరిస్తున్న ఎంఎఫ్‌పీ సూపరింటెండెంట్ అప్పారావు

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ఉత్పత్తులను గరిష్ట ధరకు విక్రయించాలని ఎంఎఫ్‌పీ సూపరింటెండెంట్ జి.అప్పారావు పేర్కొన్నారు. మండలంలోని బీరుపాడులో జీసీసీ గిరిజన ఉత్పత్తులపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులకు సంబంధించి విశాఖపట్నం జీసీసీ ప్రధాన కార్యాలయం నుంచి గిరిజన ఉత్పత్తులపై కొత్త ధరలను ప్రకటించడం జరిగిందన్నారు. జీసీసీ నిర్ణయించిన ధరల కంటే తక్కువకు ఏ ఒక్క గిరిజనుడు ఉత్పత్తులను విక్రయించరాదన్నారు. కార్యక్రమంలో సేల్స్‌మేన్ జె.గోపాలరావు తదితరులున్నారు.

ఇసుక తవ్వకాలపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

- 21 వాహనాలు సీజ్


జేసీబీని అడ్డుకుంటున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి

పాలకొండ: మండలంలోని గోపాలపురం సమీపంలోని నాగావళి నదిలో అక్రమంగా ఇసుక ర్యాంప్ నిర్వహించడంపై సబ్ కలెక్టర్ యశ్వంత్ కుమార్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ మైనింగ్ విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ర్యాంప్‌ను పరిశీలించి, 3 జేసీబీలతో తవ్వకాలు జరుగుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఇసుక లోడింగ్ కోసం ఏర్పాటు చేసిన ఆరు టిప్పర్లు, 12 ట్రాక్టర్లతో పాటు మూడు జేసీబీలను సీజ్ చేశారు. తవ్వకాలపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎస్సై ప్రయాగ మూర్తి, డీటీ సన్యాసిరావులను ఆదేశించారు.

శంబర జాతరకొచ్చే భక్తులకు వైద్యసేవలు


శంబర పీహెచ్‌సీలో మందుల నిల్వలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ భాస్కరరావు

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, శంబర పోలమాంబ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని డీఎంహెచ్‌ఓ భాస్కరరావు తెలిపారు. ఈ నెల 27, 28, 29వ తేదీల్లో జరిగే తొలేళ్లు, సిరిమానోత్సవ సమయాల్లో విరివిగా వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తామన్నారు. ఇందులో భాగంగా శంబర పీహెచ్‌సీను ఆయన శుక్రవారం పరిశీలించారు. మందుల నిల్వలు, రికార్డులను తనిఖీ చేశారు. శంబర గ్రామంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసే స్థలాలను పరిశీలించారు. జాతరలో 24 గంటలూ వైద్యసేవలు భక్తులకు అందించేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారులు కిరణ్‌కుమార్, రమ్యశ్రీలకు సూచించారు. 108,104 వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో పీఓ వినోద్ కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రక్తహీనత నివారణే ధ్యేయం

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణే ధ్యేయంగా అంగన్‌వాడీ కేంద్రాలు పనిచేస్తున్నాయని స్త్రీ శిశు సంక్షేమశాఖ రీజనల్ జాయింట్ డైరెక్టర్ (విశాఖపట్నం) చిన్మయదేవి అన్నారు. మండలంలోని ఉల్లిభద్ర అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, కేంద్రానికి సరఫరా అవుతున్న పౌష్టికాహారం సరఫరాపై ఆరా తీశారు. అక్కడి కిచెన్ గార్డెన్‌ను పరిశీలించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను బోధించాలని కార్యకర్తకు సూచించారు. ప్రతీనెల 5వ తేదీన తల్లిదండ్రులతో సమావేశాన్ని నిర్వహించి ప్రీస్కూల్ నిర్వహణపై అవగాహన కల్పించాలన్నారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. పరిశీలనలో పెదగుడబ ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ రౌతు లక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది మరదాన కల్పన, ఎస్.లావణ్య, తదితరులు పాల్గొన్నారు.

వేగావతిలో పడి యువకుడి మృతి


శివశంకర్ మృతదేహం

సాలూరు: పట్టణంలో వేగావతినది నీటిలో పడి ఓ యువకుడు మృతిచెందినట్లు సీఐ అప్పలనాయుడు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం, పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన తుపాకుల శివశంకర్(25) స్థానిక వేగావతి నది వద్ద నీటిలో మునిగిచనిపోయి ఉండడాన్ని గమనించి, యువకుడి తల్లి మంగమ్మ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. శివశంకర్ బహిర్భూమికి వెళ్లి తాగిన మైకంలో నీటిలో పడిపోయి ఉండవచ్చనే కోణంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

కుంభమేళాకు ప్రత్యేక రైళ్లు

- కొత్తవలసలో ప్రత్యేక హాల్ట్

తాటిచెట్లపాలెం: ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు విశాఖపట్నం, పరిసర ప్రాంతాల నుంచి వెళ్లే యాత్రికులు, ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వేశాఖ ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. పెందుర్తి, కొత్తవలస ప్రాంత ప్రయాణికుల కోసం కుంభమేళా ప్రత్యేక రైళ్లకు కొత్తవలసలో హాల్ట్ ఇస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

- విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08562) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రైలు ఫిబ్రవరి 16వ తేదీ రాత్రి 10.20 గంటలకు విశాఖలో బయలుదేరి 18వ తేదీ రాత్రి 8.25 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఎక్స్‌ప్రెస్ రాత్రి 10.48 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 10.50 గంటలకు బయలుదేరుతుంది. గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08561) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 19వ తేదీ మధ్యాహ్నం 2.20 గంటలకు గోరఖ్‌పూర్‌లో బయలుదేరి 21వ తేదీ మధ్యాహ్నం 12.15 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ మధ్యాహ్నం 11.22 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 11.24 గంటలకు బయలుదేరుతుంది.
- విశాఖపట్నం–దీన్‌దయాల్ ఉపాధ్యాయ (08530) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 6, 20, 27వ తేదీల్లో (గురువారం) సాయంత్రం 5.35 గంటలకు విశాఖలో బయలుదేరి ఫిబ్రవరి 8, 22, మార్చి1 (శనివారం)న వేకువజామున 4.30 గంటలకు దీన్ దయాల్ ఉపాధ్యాయకు చేరుకుంటుంది. ఈ స్పెషల్ ఆయా రోజుల్లో సాయంత్రం 6.05 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 6.07గంటలకు బయలుదేరుతుంది.
- దీన్‌దయాల్ ఉపాధ్యాయ–విశాఖపట్నం (08529) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 8, 22, మార్చి 1(శనివారం)న రాత్రి 8.10 గంటలకు దీన్‌దయాల్ ఉపాధ్యాయలో బయలుదేరి, ఫిబ్రవరి 10, 24, మార్చి 3 (సోమవారం)వ తేదీల్లో తెల్లవారుజాము 3.25 గంటలకు విశాఖ చేరుకుంటుంది. ఈ స్పెషల్ తెల్లవారు 2.36 గంటలకు కొత్తవలస చేరుకుని, అక్కడ నుంచి 2.38 గంటలకు బయలుదేరుతుంది.